కథ

# యముని మహిషపు లోహఘంటలు

జీవన్


మూసీనది బ్రిడ్జి మీదకి రాగానే హఠాత్తుగా బస్సు ఆగింది.

ఎన్ని దశాబ్దాల లేదా శతాబ్దాల తరువాతనో నదీమ తల్లి వరదలతో, నురగలతో ఉరకలు పరుగులు పెడుతున్నది.

బిల బిలా జనమంతా కిందకు దిగుతున్నారు.

మరిన్ని బస్సులు ఆగుతూనే ఉన్నాయ్.

మరింత మంది జనం కిందకు దిగుతూనే ఉన్నారు.



నడుముల లోతు నీటిలోకి దిగిన కొందరు దోసిళ్ళ కొద్దీ నీళ్ళు తాగు తున్నారు. ''ఒద్దొద్దు, తాగ కండి, మురికినీళ్ళు! ఆరోగ్యానికి మంచిది కాదు. తాగొద్దు, తాగొద్దు'' అరుస్తున్నా. ''ఎవరన్నా రయ్యా, ఇవి మురికి నీళ్ళని, చూడు, ఎంత స్వచ్ఛంగా నిర్మలంగా ఉన్నాయో!'' అంటున్నారు వాళ్ళు. ''ఎంత తియ్యగా ఉన్నాయో, రండి, రండి! కడుపు నిండా తాగండి'' అంటూ మిగతావాళ్ళని ఆహ్వానిస్తున్నారు. కొందరు మరికొంత ముందుకు పోయి నదిలో తనివితీరా ఈదులాడుతున్నారు. ''నడుము నొప్పులూ, ఒంటి నొప్పులూ మటుమా యమవుతున్నాయి. చర్మవ్యాధులు క్షణంలో నయ మవుతున్నాయ్. రండి, రండ్రారండి, నీటిలో దూకండి'' అంటూ ఉత్సాహంగా కేకలేస్తున్నారు.

''ఈ నీళ్ళు తాగం గానే ఎక్కడలేని సత్తువొస్తు న్నది. నీరసం దూరమవు తున్నది, రండయ్యా రండి, రండమ్మా రండి, కడుపార తాగండి'' దోసిళ్ళ కొద్దీ నీళ్ళు తాగుతున్నారు. ఇతరులతో తాగిస్తున్నారు.

అంతా కోలాహలం. నీళ్ళు తాగేవాళ్ళు తాగుతు న్నారు. ఈదేవాళ్ళు ఈదుతున్నారు.

కిందికి దిగిన నేను ముందుగా కొంచెం నీరు పుక్కిట పట్టి ఉమ్మి, అటు తరువాత ఓ గుక్కెడు మింగా. ఆశ్చర్యం, కొబ్బరి నీటికంటే తీయగా, రుచిగా ఉన్నయ్! దోసిలిపట్టి మళ్ళీ మళ్ళీ తాగా. కడుపు నిండి నట్టయింది. ఇంతకు ముందెన్నడూ లేనంత హాయిగా వుంది. ఉల్లాసంగా, ఉత్సా హంగా ఉంది.

మిగతా వాళ్ళందరితో పాటు నదిలోకి దూకి ఈదులాడుతున్నా, నీరసం గానీ, అలసట గానీ అనిపించడం లేదు. మేనినంతా నిమురుతున్న అలలు నాలో ఏదో కొత్తశక్తిని నింపుతున్నట్టనిపిస్తున్నది....



నదీ తీరం వెంట విశాలమైన పచ్చిక బయళ్ళు.

పచ్చికబయళ్ల నిండా సీతాకోక చిలుకల గుంపుల్లా గుంపులు గుంపులుగా పిల్లలు.... చల్లని, మెత్తని గరిక పచ్చమైదానాల్లో నగ్నపాదాలతో లేడి పిల్లల్లా పరుగులు పెడుతూ, గంతులేస్తూ... రంగు రంగుల గరికపూలు కోస్తూ ఒకరిపై మరొకరు రువ్వుకుంటూ సిగల్లో తురుముకుంటూ...

పిల్లల కోలాహలంతో పొదల నుండి బయటపడి పరుగులు తీస్తున్న కుందేళ్ళు... వెంట బడే బాలల గుంపులు... పొదలమాటున బిక్కు బిక్కు మంటూ నక్కిన కుందేటి పిల్లలను అక్కున చేర్చుకుంటున్న మరికొందరు... వాటి నీలి నీలికనుల సౌందర్యాన్ని వీక్షిస్తూ కొందరు, ఎర్రెర్రని బుజ్జిబుజ్జి పెదాలను ముద్దిడుతున్న మరికొందరు... వాటి శరీరాల మఖ్మల్ మెత్తందనాలతో మైమరిచి పోతున్న మరికొందరు...

చెవులు రిక్కించి, మోరలు సాచి ఇందరిందరు పిల్లలను ఆశ్చర్యంతో పరికిస్తూ కదలక, మెదలక, శిలా ప్రతిమల్లా లేళ్ళ మందలు... అంతకంటే ఆశ్చర్యంతో, ఆనందంతో వాటిని సమీపించే పిల్లల గుంపులు...

నాలుగు కాళ్లపై లేచి, భూమిపై పాదాలాన్చకుండా పరుగులు తీస్తున్న లేళ్ళు... ఆ వేగంతో పోటీపడలేక రొప్పుతూ, రోజుతూ చెమటలు పట్టిన మేనులతో చతికిలపడ్డ బాలల మందలు...

నిర్మల స్ఫటికాల్లా ప్రవహించే సెలయేరులు... తడిసిముద్దలై ఆణి ముత్యాలవుతున్న పిల్లలు. ఏటి గలగలల సప్తస్వరాలతో శృతి కలుపుతున్న వేనవేల గళాలు...

ఆకస వీధిని శోభాయమానం చేస్తున్న ఇంద్రధనస్సు... అందుకోవాలని గంతులేస్తున్న శిశు సముహాలు...

పచ్చికబయళ్ళ విశాలవేదిక నిండా పురివిప్పిన నెమళ్ళ ఆనంద నర్తనలు... మయూర క్రేంకారాలతో గొంతులు సవరించుకొని వలయాకృతిలో నృత్యవినోదాల్లో మైమరచిన బాల నటరాజులు..

పసిడి పలుకుల చిలుకలు, మైనాలు, గోరెంక నేస్తాలు... కోయిలమ్మల కుహూరవాలతో పోటీపడుతూ బాలగంధర్వులు...

విరబూసిన పూలవనాలు...

మల్లెలు, మొల్లలు, విరజాజులు, పారిజాత సుమసౌరభాలు, బంతీ చేమంతుల విలాసవతులు... ముద్దమందారాల ముద్దుగుమ్మలు... స్నిగ్ధ సుకుమార గులాబీ తరుణులు... కొలనులనిండా విరిసీవిరియని కలువపూల కోమలాంగులు...

మధువులు గ్రోలుతూ పూవుపూవుపై వాలే తుమ్మెదలు... తుమ్మెద ఝుంకారాల సితారాలు... తూనీగల తోకలు పట్టుక అనంతదూరాలకు పరుగులిడే చిరంజీవులు...

చిరంజీవుల కనులలో వెల్లివిరిసిన తారాతోరణాలనూ, ముఖాలలో ఉదయించిన కోటిచంద్ర ప్రభలనూ సంభ్రమాశ్చర్యాలతో తిలకించే తల్లులూ, తండ్రులూ....

ఎల్లలెరుగక విస్తరించిన పండ్ల తోటలు

అనేకానేక ఫల వృక్షాలు...

చవులూరించే మామిడీ, జామా, పులపుల్లని దానిమ్మా, నారింజ, రసాలూరించే పనసా బత్తాయీ, నోట్లో వేసుకోగానే కరిగిపోయే ద్రాక్ష తియతీయని ఖర్జూరా, వగరు వగరు వెలగ... షడ్రుచుల ఫలసంతతి...

మనిషి ఆవిర్భావానికి ముందునించీ భువిపై దినదినాభివృద్ధి చెందుతూ వస్తున్న వేనవేల ఫల వృక్ష సంపద...

లింగభేదమూ, వయోభేదమూ మరచి పండ్ల తోటలపై ఎగబడిన జనసందోహం....

కొరికిన పండు కొరకకుండా, చూసిన రుచి చూడకుండా, తాకిన చెట్టు తాకకుండా ఫలాస్వాదన...

ఆదిమకాలం నుండి మానవుడి శరీరానికి శక్తినీ, మేధస్సుకు పదునూ అందించే ఫలరస వారాసులు...

కడుపారా భుజించి ఆకసాన్ని చుంబించే వన వాటికల నీడల్లో విశ్రమిస్తూ మానవ సమూహం...

ప్రకృతి ఒడిలో మనిషి

తన వెచ్చని ఒడిలో మనిషిని పొదుముకున్న ప్రకృతి.

ప్రకృతిసేవలో మనిషి.

కలలో కూడా ప్రకృతికి కీడు తలపెట్టని మనిషి.

మనిషిని రక్షిస్తూ ప్రకృతి.

ప్రకృతిని పరిరక్షిస్తూ మనిషి

ప్రకృతిలో అంతర్భాగమై మనిషి

అనంత కాలాలకు సాగుతూ...

కీచుమనే విపరీతమైన రొద చేస్తూ రెండు పర్వతాలు ఢీకొన్న భయంకర శబ్దం.

భూమికీ ఆకాశానికీ మధ్య వేలాడుతున్న అపార్టుమెంటు ఒక మూలన బిక్కుబిక్కుమంటూ నక్కిన బెడ్‌రూమ్‌లోని మంచంపై శయనించిన నేను గుండెలవిసే శబ్దానికి కలవరపడుతూ లేచి కూర్చున్నా. అప్పటిదాకా నా గుండెల మీద పావురంలా నిద్రిస్తున్న ఆల్డస్ హక్స్లీ నవల ''బ్రేవ్ న్యూ వర్ల్డ్'' పక్కకు జారి పడిపోయింది. బిత్తరపోతూ కిటికీలోంచి చూసే సరికి రోడ్డు మీద ఢీకొన్న రెండు పెద్ద లారీలు. హాహాకారాలు... నల్లని తారు రోడ్డుపై ఎర్రని నెత్తుటి మడుగులు... ఆగిపోయిన ట్రాఫిక్...

రాత్రి పొద్దుపోయిందాకా నాతో సంభాషించిన ఆల్డస్ హక్స్లీ గుర్తుకొచ్చాడు.

గొప్ప రచయితలు తాము వాడే ప్రతి అక్షరాన్నీ, పదాన్నీ అస్త్రంలా, శస్త్రంలా సంధిస్తారనడానికి ఆల్డస్ హక్స్లీ అద్భుత నవల ''బ్రేవ్ న్యూ వర్ల్డ్'' సజీవ తార్కాణం. ప్రపంచ ప్రసిద్ధ నాటకకర్త షేక్స్పియర్ 'టెంపెస్ట్' నాటకంలోని మెరిండా మాటలను తన నవలకు శీర్షికగా స్వీకరించాడంటేనే అతని బుద్ధిగ్రాహ్యత గోచరిస్తుంది. షేక్స్పియర్ మాటల్లో వ్యంగ్యం ధ్వనించినట్టుగానే తన నవలా రచనలలోనూ వ్యంగ్యాన్ని పలికించాడు. హక్స్లీ సృష్టించిన కృత్రిమ ప్రపంచం శ్రీశ్రీ స్వప్నించిన 'మరో ప్రపంచం' కానప్పటికీ సమాజంలోని అనేక అపసవ్య రీతులను అది విమర్శిస్తుంది. తత్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రాల్లోని కొన్ని ధోరణులను తార్కిక ముగింపు దాకా కొనసాగిస్తే ఏమవుతుందో అనే హెచ్చరిక ధ్వనిస్తుంది.

బౌద్ధిక ప్రపంచం నుండి భౌతిక ప్రపంచంలోకి అడుగిడి....

దంత ధావనం చేసి అటుచూస్తే వంటింటి కీకారణ్యంలో చీకాకు పడుతూ శ్రీమతి, స్కూల్ వ్యాన్ వచ్చే వేళయిందని గాభరా పడుతూ పిల్లలు. చేతనైన సాయం చేస్తున్నానని అనిపించుకోవడానికి రెండు కూరలు తరిగి, టీకాచి ఆమెకింతపోసి నేనింత తాగి, పిల్లల నెక్‌టైలు సరిచేసి, బూట్ల లేసులు బిగించే పనిలో పడ్డా. ఏమితింటున్నారో తెలియ కుండా ఏదో మింగి బాక్సులూ, బ్యాగులూ బరువుగా మోసుకుంటూ పరుగులు తీశారు పిల్లలు. అరగంటకల్లా మేమూ తయారై అపార్ట్‌మెంటు భూతాన్ని తాళంతో బంధించి చెరోదారిన చెరో వాహనంపై చెరో లోకానికి పయనమయ్యాం.

తీరం కానరాని ట్రాఫిక్ సంద్రంలో చుక్కాని తెగిన నావలాంటి టూ వీలర్‌పై గమ్యం వెదుక్కుంటూ బయల్దేరా...

గాంధీ ఆస్పత్రి దగ్గరకొచ్చేసరికి ట్రాఫిక్‌జామ్. ఎవరో రాస్తారోకో చేస్తున్నట్టున్నారు. సిటీ బస్సుల సందుల్లోంచి, ఆటోల తోకలు పట్టుకొని సాగుతూ దగ్గరకుపోయి చూద్దును గదా – శవాలను రోడ్డుపై ఉంచి గుండెలు బాదుకుంటూ విలపిస్తున్న గుడిసెవాసులు. ఆ నోటా ఈ నోటా సేకరించిన సమాచారాన్ని బట్టి మహానగర ప్రభువులందించిన 'మంచి నీరు' తాగి ప్రాణాలు పోగొట్టుకున్న అభాగ్యులని తెలిసింది. నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల నిండా అతిసార వ్యాధిగ్రస్తులేనట. బతుకు బరువై పల్లెలు తరిమేస్తే మురికివాడల కాందిశీకులైన వాళ్ళు. దిన దిన గండం కాదు క్షణక్షణ గండం పొంచి వున్న వాళ్ళు. క్యాన్లతో నీటిని కొనలేని పూట గడవని అభాగ్యులు. 'బువ్వ పెట్టకపోతే మానె, గుక్కెడు మంచినీల్లన్న ఇయ్యకపోతిరి యముల రాజన్నలాలో' అంటూ రంగులు మాత్రమే మార్చుకునే ప్రభువులను శాపనార్థాలు పెడుతున్నారు.

ఆఫీసులో ఉన్నంత సేపూ గత రాత్రి తియ్యని కల ఆనందపరుస్తూ ఉంది. పీడకల లాంటి వాస్తవం భయపెడుతూ ఉంది.

లంచ్ అవర్‌లో ఆఫీసు కెదురుగా ఉండే హోటల్‌కు బయల్దేరాం.


టిఫిన్లూ, భోజనమూ అక్కడ రుచిగా, శుచిగా ఉంటాయని మా ఆఫీసు సిబ్బందిలో ఎక్కువ భాగం ఆ సమయంలో అక్కడకే చేరుతుంది.

''వెంకటప్పయ్యగారూ, పచ్చని అరిటాకు పరచి వేడివేడి ఇడ్లీ వడ్డించండి ఆవు నేతితో'' అంటూ ఆర్డరిచ్చింది వనజ ఓ టేబుల్ దగ్గరకు చేరి. ఆమె పక్కన శైలజ. ఎదురుగా నేను. నా పక్కన శేఖర్. మా టేబుల్‌ను ఆనుకొని పక్క టేబుల్స్ ముందు ఆనంద్, రజనీ మరికొందరు చేరిపోయారు.

రంగులోనూ, ఆకారంలోనూ అరిటాకునే పోలి వున్న ప్లాస్టిక్ పేపర్ పరచి నీళ్ళు చిలకరించి ఇడ్లీ వడ్డించబోతున్న వెంకటప్పయ్యతో ''ఇదేంటండీ, ఇంత మోసమా! అరిటాకంటే ప్లాస్టిక్ పేపరు పరుస్తారా'' అంది వనజ చిరుకోపం నటిస్తూ.

''అరటి వనాలన్నీ తుఫాన్‌కు కొట్టుకుపోతే నేనేం జేసేది చెప్పండి వనజ గారూ'' అన్నాడు పెదవులపై చిరునవ్వయినా కనిపించకుండా. తరువాత ఇడ్లీ, రెండు రకాల చట్నీలు, కారప్పొడి వడ్డించాడు.

''ఆ తుపానుకు మీ హోటలన్నా కొట్టుకుపోదాయె, మా జేబులకు చిల్లులు పడకుండా వుండును!'' అన్నాడు శేఖర్ వేడి వేడి గారె ముక్క నోట్లో పెట్టుకుంటూ...



''నా హోటలే లేకపోతే మీరంతా కాలే కడుపులతో నకనకలాడిపోరూ! అయినా నాదేమైనా బార్ షాపా బాబూ, నిలువు దోపిడీ చేయడానికి'' అన్నాడు హోటల్ యజమాని నర్మగర్భంగా.

వెంకటప్పయ్య గడసరే కాదు, రిటార్ట్స్ పేల్చడంలోనూ దిట్ట. అయితే అవేవీ అవతలివాళ్ళ మనసుల్ని గాయపరచవు. ఎవరెంత రెచ్చగొట్టినా ప్రశాంతంగా, ప్రసన్నంగా తన పని తాను చేసుకుపోతాడు. అదే పెద్ద వ్యాపార రహస్యం కాబోలు. లేకుంటే ఇంత చిన్నహోటల్‌తో ఆయన రెండు, మూడు భవంతులు కట్టి, ఇద్దరు ఆడపిల్లల పెండ్లిండ్లు అంతఘనంగా ఎట్లా జరిపించగలిగాడు ఈ అయిదారేండ్లలోనే!

మంచినీళ్ళ ప్లాస్టిక్ గ్లాసు అందుకొన్న రవికాంత్ ''ఇవి మంచినీళ్ళేనా వెంకటప్పయ్య గారూ, లేకుంటే భోలక్‌పూర్ వాసుల సరసన స్వర్గసీమ చేరతాం'' అన్నాడు.

''కావాలంటే చూడండి సార్ లేబుల్'' అన్నాడు వెంకటప్పయ్య. మంచినీళ్ళ క్యాన్‌పై 'మినరల్ వాటర్' అన్న లేబుల్ ఉంది. ''వాటికేం లెండి, కార్పొరేషన్ వాళ్ళు కూడా 'స్వచ్ఛమైన తాగునీరు' అని రాస్తారు'' అన్నాడు రవికాంత్.

స్వచ్ఛమైన నీరు అనే సరికి రాత్రి నాకొచ్చిన కల గుర్తొచ్చింది. అది వివరిస్తుంటే అవాక్కయి వింటున్నారంతా. సాంతం విన్నాక ''ఒకట్రెండు దశాబ్దాల క్రితం నాటి రోజులే సుదూర గతంలా గోచరించడం ఎంత విషాదం! ఒకనాడు హైదరాబాద్ అంటే దక్కను పీఠభూమికే మకుటాయ మానమై ఎంత సుందర నగరంగా వాసికెక్కింది! నగరానికి మణిహారాల్లో ఎన్నెన్ని సరస్సులూ, బృందావనాలను తలపించే ఉద్యాన వనాలు, లెక్కకు మిక్కిలి పండ్ల తోటలు, నగరాన్ని పచ్చని దుప్పటి కప్పినట్టుగా చల్లని నీడలు పరచే వృక్ష సంతతులు - ఓహ్, నగరమంతా అద్భుతంగా ఉండేది!'' అన్నాడు శేఖర్ గత వైభవాన్ని స్మరించుకుంటూ.

''కవిత్వం పాలు ఎక్కువైంది శేఖర్, రేపటినుంచి హోటల్‌లోకి రానీకుండా మిమ్మల్ని తరిమేస్తాడేమో ప్రొప్రైటర్. కాస్త జాగ్రత్త, పొదుపుగా వాడండి మాటల్ని'' అంటూ ఆటపట్టించింది రజని.

''దాని మాటలకేం లెండిగానీ, నాకింకా బాగా గుర్తేవుంది. హైదరాబాదు అంగూర్లు ఎంత మధురంగా వుండేవి! మోసంబీ రసం గొంతులోకి దిగుతుంటే అమృతమేననిపించేది'' అన్నది వనజ వర్ణనల్లో తానేమీ తీసిపోనట్టు.

''నిజమే, ఒకనాడు సమశీతోష్ణస్థితిలో ఆహ్లాదంగా ఉండే నగరం పచ్చదనమంతా ఇవాళ్ళ నిప్పుచ్చరమై ఆకాశాన్నంటే కంకరవనాలు విస్తరిస్తున్నయ్. నగరానికి మంచి నీరందించే ప్రతి సరస్సూ, ఆఖరికి ఈ నగర చరిత్రతో ముడిపడిన సుజలాల మూసీనది సైతం కాలుష్య కాసారాలుగా మారాయి. నగరంలోని చెత్తాచెదారమంతా వాటిలోనే నాయె'' ఓ శిథిల నగర పురావైభవాన్ని స్మరించుకుంటున్నట్లు అన్నాడు ఆనంద్.

అందరి టేబుల్స్ మీదున్న ప్లాస్టిక్ ప్లేట్లూ కప్పులూ గ్లాసులూ చూపిస్తూ ''ఈ ప్లాస్టిక్‌ని ఎవడు కనిపెట్టాడో గానీ సర్వ వ్యాపితమైంది. వేల సంవత్సరాలయినా ఇవి కరగవట. ఎందెందు వెదికి చూసిన అందందు నేనట్టు ఎక్కడ చూసినా అవేనాయె చెత్తను భద్రపరుస్తూ. వీటిని పూర్తిగా నిషేధిస్తేనే గానీ దరిద్రమొదలదు'' అంటూ ప్లాస్టిక్ వస్తువులపై తన ఆగ్రహాన్నంతా వ్యక్తం చేశాడు రవికాంత్.

''వాయు కాలుష్యమెంత పెరిగిపోతున్నది! ఇన్ని వేల, లక్షల వాహనాలూ, ఏ నియంత్రణా లేకుండా జనావాసాల మధ్య నగరం నడి బొడ్డున వెలిసిన ఇన్నిన్ని పరిశ్రమలు ఎంత వాయు కాలుష్యానికి కారణమవు తున్నయ్. కార్బన్‌లెవల్స్ అనూహ్య రీతిలో పెరిగి పోవడానికి ఇవే కారణం కాదా'' కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన వనజ విశ్లేషించింది.

''చదువూ సంధ్యలు పెద్దగా లేని ఒక సామాన్య రైతు తన అనుభవ సారంతో ఈ మార్పుని ఎట్లా విశ్లేషిస్తున్నాడో వినండి'' అంటూ మొదలు పెట్టా నేను. ''మా చిన్నతనంలోనే మెదక్ జిల్లాలోని ఓ మారుమూల కుగ్రామం నుంచి మేమిక్కడకు వలసొచ్చాం. చాలాకాలం తరువాత ఈ మధ్యనే ఓ పెండ్లికి మా ఊరెళ్ళినప్పుడు మా పెదనాన్న ఊరొదిలిన మేమే ఎంతో అదృష్టవంతులమంటూ తన గోడంతా నా ముందు వెళ్ళబోసు కొన్నాడు. వేలాది సంవత్సరాలుగా ఈ దేశంలో అభివృద్ధి చేస్తూ వచ్చిన సేద్య విధానమంతా తారు మారయిందంటాడాయన. ఒకనాడు రైతు తన పంట నుంచే విత్తనాలు సేకరించి భద్రపరుచుకునే వాడు, పశువుల ఎరువూ పచ్చిరొట్ట లాంటి సేంద్రియ ఎరువులే వాడేవాడు, పురుగంటూ ఉండేది కాదు, పురుగు మందుల వాడకమూ ఉండేది కాదు. వ్యాపార పంటలకు కాకుండా ఆహార పంటలకే ప్రాధాన్యమిచ్చేవాడు. రైతు తన కాళ్ళపై తాను నిలబడిన రోజులు అవి అంటాడు. ఇప్పుడేమో హైబ్రిడ్, బీటి విత్తనం, రసాయన ఎరువులు, పురుగు మందులు, మార్కెట్ - ఇట్లా అన్నింటికి ఇతరులపై ఆధారపడాల్సి వస్తుందంటాడు. దీనితో భూసారం క్షీణించి ప్రమాదకరమైన రసాయనాలతో నేలా, నీరూ, ఆహారం కలుషితమయ్యాయంటాడు. రుతువుల రీతి మారిందంటూ కార్తెలన్నీ మాసిపోయి రోహిణి మాత్రమే మిగిలిందంటాడు. అతివృష్టి, లేకుంటే అనావృష్టి - దుక్కి దున్నేవాడికి పెద్ద చిక్కే వచ్చిందంటాడు. వ్యవసాయం రైతు చేతుల్లోంచి జారిపోయిందనీ క్రమంగా భూమీ చేజారి, రైతు పూర్తిగా బానిసగా మారుతాడేమోనని ఆందోళన పడుతున్నాడు. రైతు కాడి కిందపడేస్తే ఈ లోకం ఆకలి తీర్చి ఆదుకొనే వాడెవడంటాడు'' అంటూ మరో భయంకర దృశ్యాన్ని వాళ్ళముందుంచా.

''హరిత విప్లవాలూ, క్షీర విప్లవాల అంతిమ ఫలితాలు ఇట్లా పరిణ మించాయన్న మాట'' అన్నాడు రవికాంత్.

''పీల్చేగాలి, తాగే నీరు, తినే తిండీ - అన్నీ కలుషితమయ్యాక మనిషి జీవితమెంత దుర్భరంగా మారింది!'' విచలితురాలై అంటున్నది వనజ.

టైం అయిపోయిందంటూ అందరం లేచాం.



## ఛా...ఛా...అలాంటిదేమీ లేదు...

తమిళ హీరో కార్తీకి, తమన్నాకి మధ్య ఏదో నడుస్తోంది అన్న పుకార్లు ఇటీవలి కాలంలో బాగా షికారు చేస్తున్నాయి. త్వరలోనే వీరిద్దరూ పెళ్ళి కూడా చేసుకోబోతున్నారన్న పుకారు కూడా వినిపించింది. ఇదే విషయాన్ని తమన్నాని అడిగితే తేలిగ్గా కొట్టిపారేసింది. ''నెట్‌లో ఇలాంటి వార్తల గురించి నేనూ చదివాను. కార్తీ, నేనూ మంచి ఫ్రెండ్స్ మాత్రమే! అంతకు మించి మా మధ్య ఏదీ లేదు. ఏదీ లేకుండానే ఇలాంటి పుకార్లు ఎందుకు వస్తున్నాయో నాకు అర్థం కావడం లేదు'' అంటూ చెప్పుకొచ్చింది.

***

ఆ రాత్రి పడుకున్నానన్న మాటేగానీ ఎంతకూ నిద్ర రావడం లేదు. కిటికీలు, పైకప్పు గుడ్లప్పగించి చూస్తున్నా. ఖాళీగా, బోసిగా కనిపిస్తున్న వెంటిలేటర్లను చూస్తుంటే ఓ ఆసక్తికర అంశం గుర్తుకొస్తున్నది. పదేళ్ళ నాటి దాకా ఇంటి నిండా ఊర పిచుకలు తిరుగుతూ తెగ హడావిడి చేస్తుండేవి. మా పెద్దబ్బాయి అప్పటికి నెలల బాలుడే. ఏడుపు మొదలు పెట్టాడంటే ఒక పట్టాన ఆపేవాడు కాదు. ఒకరోజు వాళ్ల అమ్మ వాణ్ణి ఎత్తుకొని పిచ్చుకల్ని చూపించింది. అవి ఎగురుతుంటే వాటిరెక్కల చప్పుడూ, వాటి కిలకిలారావాలతో ఏడుపుమాని బోసినోట నవ్వుల పూలు పూయించాడు. వాడి ఏడుపు ఎట్లా ఆపాలో అప్పుడు అర్థమైంది నాకు.

ఇప్పుడు మచ్చుకు చూద్దామన్నా ఒక్కటికూడా కనిపించకుండా పోయింది. ఆ మధ్య మా ఆవిడ మేనమామకు బాగా జబ్బు చేసిందంటే చూడ్డానికి వాళ్ళ ఊరెళ్ళాం. పట్టణాలకు కాస్త దూరంగా ఉండే ఊరు. అక్కడ కొన్ని పిచ్చుకలు కనిపిస్తే ఆశ్చర్యంగా చూసి మా పిల్లలకు చూపించా. ఎంత ఆనందపడిపోయారో వాళ్ళు. మమ్మల్నే ఆశ్చర్యంగా చూస్తున్న ఒక ఆయనతో ''మా నగరంలో

పిచ్చుకలన్నీ మాయమై పోయాయి. ఇక్కడ కనిపించేసరికి...'' అంటున్న నాతో ''ఒకనాడు ఇక్కడ మందలు మందలుగా వుండేవి. పురుగు లేరుకొని తింటూ రైతుకు ఎంతో మేలు చేసేవి. ఇప్పుడు చాలావరకు తగ్గినయ్ ఈ టవర్ వచ్చినంక'' అన్నాడు సెల్‌ఫోన్ టవర్‌ను చూపిస్తూ.

ఎప్పుడో చదివిన వార్త గుర్తుకొచ్చింది. ఈ టవర్ల నుండి వెలువడే శబ్ద తరంగాల వల్ల పిచ్చుకల్లో పునరుత్పత్తి శక్తి బాగా క్షీణిస్తున్నదనీ మరి కొంతకాలానికి ఆ జాతి పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం పొంచి ఉందనీ, ఇప్పటికే అంతరించిపోయిన వేలాది జాతులలో అదీ చేరబోతున్నదన్నమాట!

దురాశా పీడితులైన కొందరు వ్యక్తులు కేవలం తమ స్వార్థంకోసం, సత్వర లాభాలకోసం ఎన్ని దురాగతాలకైనా ఒడిగడుతున్నారు. లక్షలాది ఎకరాల దుర్గమారణ్యాలను విచక్షణారహితంగా నిరాటంకంగా నరికి వేస్తున్నారు. ఫలితంగా వేనవేల జాతుల వన్య ప్రాణులూ, వృక్ష సంపదా, భూసారం, వాటితో పెనవేసుకుపోయిన అనేక తెగల ఆదివాసీల జీవనమూ సంస్కృతీ ధ్వంసమవుతున్నది. అమేజాన్ నదీ పరివాహక ప్రాంతాల్లోని సతత హరితారణ్యాలకు పట్టిన దుర్గతి తలుచుకుంటే గుండె చెరువవుతుంది. స్థానిక ప్రజలు ఎంత వారించినా వినకుండా ఆ సువిశాల అరణ్యాలను ధ్వంసం చేసి కోక్ సాగు చేస్తున్నారు. ఆ పంట ఎవరికి, ఎందుకు ఉపయోగపడుతుందో అందరికీ తెలిసిందే. బంగారు గుడ్లు పెట్టే బాతులాంటి కోక్ వాళ్ళకు కావాలి. అంతేగానీ పర్యావరణ విధ్వంసమూ, దాని పర్యవసానాల గురించి వాళ్ళెందుకు ఆలోచిస్తారు? ఆహార భద్రత వాళ్ళకు పడుతుందా?

పరిశ్రమల స్థాపనపేరిట, నగరీకరణ పేరిట సస్యశ్యామలమైన భూములు, జలవనరులు, సముద్ర తీర ప్రాంత అటవీ భూములు ఎంతగా కుంచించుకపోతున్నయ్. కార్బన్ తదితర ప్రమాదకర వాయువులను పీల్చుకొని ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ పర్యావరణానికి రక్షాకవచంగా నిలిచిన హరిత వనాలన్నీ అదృశ్యమైపోతే... రసాయన, అణుధార్మిక వ్యర్థాలతో భూగోళమే ఉష్ణగుండంగా మారిపోతే...

పరిస్థితి ఊహించుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది.

అట్లా అని శాస్త్ర సాంకేతికాభివృద్ధిని పారిశ్రామికీకరణనూ వ్యతిరేకించలేం గదా! కాకుంటే ఈ విషయాల్లో ఆచితూచి అడుగేయాలి. ముందు, వెనుకలు బాగా ఆలోచించాలి.

అభివృద్ధి మానవ కల్యాణానికి తప్ప వినాశానికి దారితీయకుండా ఉండాలన్నది మన లక్ష్యం కావాలి. భోపాల్ విష వాయు దుర్ఘటన మిగిల్చిన విషాదపు నీలి నీడలు మనల్నింకా వెంటాడుతూనే ఉన్నాయి. చెర్నోబిల్ లాంటి ఉదంతాలు మరచిపోదామన్నా మరువలేకుండా ఉన్నాం. ఇవన్నీ హిరోషిమా నాగసాకీలకు ప్రతి రూపాలుగానే మిగిలి పోతాయి.

రుతువుల రీతులు మారిపోయి కార్తెలన్నీ మాసిపోయాయన్న పెదనాన్న మాటలు వెంటాడుతూనే ఉన్నయ్ నన్ను. ఒకదగ్గర అతివృష్టి, మరో దగ్గర అనావృష్టి. విస్తరించే ఎడారులొకవంక, తుపాను భీభత్సం మరో వంక. ప్రకృతి కన్నెర్ర చేస్తే కాందిశీకులుగా మారిన అభాగ్యులనేకులు. తుపానులు, హరికేన్‌లు, టోర్నెడోలు సంభవించినప్పుడల్లా ఆ జల ప్రళయాలకు కత్రినా అనో, ఐలా అనో మరోటనో నామకరణం చేసి ఓ నాలుగు రోజులు సహాయ పునరావాసాలంటూ నానా ఆర్భాటం చేసి అటు వెనుక అంతా మర్చిపోవడం సర్వసాధారణమైపోయింది. శవాలను లెక్కించడంతోనో లేదా కుళ్ళిపోయిన శవాలను ఖననం చేసి ఓ నాలుగు రోజుల పాటు శరణార్థి శిబిరాలు నడపటంతోనో తమ పని అయిపోయి నట్టుగా ప్రపంచ రాజ్యాలు వ్యవహరిస్తున్నాయే తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం వెతికే దిశగా ఒక్క అడుగూ ముందుకేయడం లేదు. కమనీయ నగరాల్లో కనువిందు చేసే స్వర్గధామాల్లో విందూ వినోదాల నడుమ వాతావరణ మార్పుని చప్పరిస్తూ వాగాడంబర ప్రకటనలు గుప్పించే ప్రపంచ రాజ్యాధిపతులు నెపం ఒకరిపై మరొకరు మోపు కుంటూ అంతా తప్పుకుంటారే తప్ప మూలాన్ని శోధించరు.

శుష్క వాగ్దానాలు!
శూన్య హస్తాలు!

ఏటికేడు పర్యావరణ సమతౌల్యం దెబ్బతిని వాతావరణ ఉష్ణోగ్రతలు పరిమితి దాటి పెరగడం వల్లనే గతంలో ఎన్నడూ లేనంత తరచుగానూ ఉధృతంగానూ జలప్రళయాలు సంభవిస్తున్నాయని శాస్త్రవేత్తలు నెత్తీ నోరూ బాదుకొని మరీ చెబుతున్నారు. సప్త సముద్రాలు వేడెక్కి పోతున్నయ్, ధృవప్రాంతాలతో సహా మంచు శిఖరాలన్నీ కరిగి పోతున్నయ్. సముద్రమట్టాలు ఊహించని రీతిలో పెరిగి దీవులకు, దీవులనే కబళిస్తాయని తీర ప్రాంతాలను ఆక్రమించుకొంటాయని హెచ్చరిస్తున్నారు.

ఎడారులింకా ఇంకా విస్తరిస్తాయంటున్నారు.

సమీప భవిష్యత్తులో ఎన్ని నగరాలూ, ఎన్నెన్ని రాజ్యాలు కనుమరుగు కాబోతున్నాయో! ఎంత ప్రాణనష్టం పొంచి వుందో, ఇంకెంత ఆస్తినష్టమో! తాము నమ్ముకున్న నేలతో సహా సర్వం శాశ్వతంగా కోల్పోయి కొత్తరకం కాందిశీకుల జాబితాలో చేరిపోయే కోట్లాది మంది అభాగ్యుల పరిస్థితి ఏమిటో!

భస్మాసురుడు తన చేతులు నెత్తిన పెట్టుకొని తన వినాశాన్ని తానే కోరి తెచ్చుకొన్నాడే గానీ స్వార్థపరుడైన నేటి మనిషి అట్లా కాదే! తనకే కాదు తనతో పెనవేసుకుపోయిన సమస్త ప్రకృతికీ పెనుప్రమాదకారిగా పరిణమించాడు. లక్షలాది సంవత్సరాలుగా ఈ భూగోళం మీద ఏర్పడిన జీవరాసులూ, వేల సంవత్సరాల కృషితో మనిషి నిర్మించుకుంటూ వచ్చిన సమస్త నాగరికతా పురోభివృద్ధీ సమాధి కావలసిందేనా? 'ఏ వెలుగులకీ ప్రస్థానం' అంటూ మానవ నాగరికతా ప్రస్థానం పట్ల ఆశావహ దృష్టి కనపరచిన మహాకవి వాక్కులు మూగబోతాయా?

పూర్వం బలవంతుడైన రాజు మరో రాజును జయించాలంటే ఆ రాజ్యాన్ని ధ్వంసం చేసేవాడు, అక్కడి ప్రజల్ని విచక్షణా రహితంగా ఊచకోత కోసేవాడు. మనిషి ప్రకృతిని జయించడమంటే కూడా ఇంతేనా? ప్రకృతిని సర్వం సహా ధ్వంసం చేయడమేనా?

వివేకవంతుడైన మనిషి చేసే పనేనా ఇది?

వివేచనాశక్తీ విచక్షణా జ్ఞానమూ ఏమైనట్టు!

యముని మహిషపు లోహ ఘంటికానాదాన్ని వినేవారెవరైనా ఉన్నారా?

*

రచయిత సెల్ నెం: 99489 08230

కవిత

# కలలా వెళ్ళిపోతోంది



హఠాత్తుగా మాటలు మౌనమై
హఠాత్తుగా తీగలు తెగిపోయి
హఠాత్తుగా దీపాలు కొండెక్కిపోయి
ఎప్పటినించో హమ్ చేస్తున్న రాగం
ఆల్జీమర్స్ వ్యాధి వొచ్చినట్టు మర్చిపోయి
ఆం అప్పుడు మర్చిపోయి
హఠాత్తుగా వానజల్లు కురిసి తడిపేసింది
హఠాత్తుగా ఆగిపోయింది
తప్పదు, లోపలికి లోలోపలికి
తవ్వుకుంటూ పోవాలి
ఉద్వేగాల అంచులమీంచి ఒక శోధన మొదలు పెట్టాలి
ఆధ్యాత్మికతని ఆసరా చేసుకుంటూ
కన్నీళ్ళు వున్నాయి దిగుడు బావి లోతుల్లో
పూడిక తీయటం చేతకావటం లేదు

ఏదో ఆసరా చేసుకుని పూడిక తీత చేస్తూ పోవాలి
ఇక్కడ బతుకు వుంది అవమానం వుంది
ఆకలీ నిద్రా కన్నీళ్ళూ అనారోగ్యం
అన్నిటికీ గోసాయి చిట్కాలేమీ లేవు కదా!
కలయో నిజమో కలవో లేదో ఎద ఉన్నది ఈ వేదనకేనో
దూరాకాశంలో ఆశల దీపాలు వెలుగుతూనే వుంటాయి
తలుపులన్నీ వేసిన తర్వాత ఒంటరిగా నా గదిలో సీతాకోక చిలుక
తలుపుతీశాను ఎగిరిపోయింది
దోసిట్లో సీతాకోక చిలుకలు వొదిలేసిన దృశ్యం
ఏదో కళ్ళమీంచి కలలా వెళ్ళిపోతోంది

– శివలెంక రాజేశ్వరీదేవి